
కల్వకుర్తి ప్రజాఆశీర్వాదసభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలతో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలం

కాంగ్రెస్ వస్తే కరెంట్ కాటగలుస్తది, రైతు బంధుకు రాంరాం, దళితబంధుకు జైభీం.. మళ్లీ దళారీ వ్యవస్థ రాజ్యమేలుతది

ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి

జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకొని మరింత అభివృద్ధిని స్వాగతించండి

కల్వకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

# 1.50లక్షల ఎకరాలకు కృష్ణా నీళ్లిస్తాం

కల్వకుర్తి, నవంబర్ 19 : బీఆర్‌ఎస్‌కు ఓటేసి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కల్వకుర్తి నియోజకవర్గానికి పాలమూరు- రంగారెడ్డి ఎతిక్తపోతల పథకం ద్వారా 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. మహాత్మాగాంధీ, పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి దాదాపు 90 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం కల్వకుర్తిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పరిపాలన కాలంలో కల్వకుర్తి నియోజకవర్గ బిడ్డలు పడ్డ కష్టాలను ముఖ్యమంత్రి మరోసారి గుర్తుకు తీసుకొచ్చారు. కరెంట్, సాగునీరు లేక వ్యవసాయం లేక.. బతకనీకి సౌలతులు లేక వలసలు పొలయ్యారని, పట్టణాలకు తరలిపోయి లంబాడీ బిడ్డలు ఆటోలు తోలుకుంటూ పడ్డ కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు, పేదల సంక్షేమంతో పాటు పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చామన్నారు. ప్రజలు కడుతున్న పన్నులను తీసుకుపోయి కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు డైరెక్ట్‌గా మాట్లాడుతున్నారని, రైతుబంధు వేస్ట్ అని కాంగ్రెసోళ్లు అంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే రైతు బంధును ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామన్నారు. కరెంట్ 24 గంటలు అవసరం లేదని పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ అంటున్నారని, మేము అధికారంలో వస్తే 3 గంటలు కరెంట్ ఇస్తామని చెబుతున్నారని, ఎట్ల సరిపోతదయా అంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాని సెలవిస్తున్నాడు ఆ బుద్ధిమంతుడని విమర్శించారు. కరెంట్ 24 గంటలు ఉండాలంటే బీఆర్‌ఎస్ పార్టీ కచ్చితంగా గెలువాల్సిన అవసరం ఉందన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే చాలా కమిటేడ్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వంపై, నాపై ఒత్తిడి తీసుకువచ్చి కల్వకుర్తి నియోజకవర్గానికి 90 వేల ఎకరాలకు సాగునీరు పారేలా చేసుకున్నాడు. 50 ఏండ్ల పరిపాలనలో కష్టాలకు గురిచేసిన కాంగ్రెస్ రూ.200 పింఛన్ మన మొఖాన కొట్టింది. ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపింది, ఉద్యమం చేస్తే కాల్చి చంపింది. కల్వకుర్తి సమీపం నుంచి రింగ్ రోడ్ వస్తుంది, ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది. బట్టి విక్రమార్క చెబుతున్నాడు. కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేస్తారట. ధరణిని తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. బ్రోకర్లు పెరుగుతారు. రైతు బంధు నిలిచిపోతుంది. ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తామంటున్న కాంగ్రెస్ ఓటు వేస్తే బతుకులు ఆగమైపోతాయి, పైరవీకారులు పెరుగుతారు, ఆలోచించుకోండి. మీటింగ్ ముగిసిన తర్వాత ఊర్లకు పోయి చర్చ పెట్టుకొండి. జాగ్రతగా ఆలోచించుకుని ఓటు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే అడిగిన పనులన్నింటినీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆమనగల్లులో రెవెన్యూ డివిజన్, ఏసీపీ, ఎంవీఐ, కల్వకుర్తిలో ఇంజినీరింగ్ కళాశాలతోపాటు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జైపాల్‌యాదవ్ బీసీ బిడ్డ.. సీట్లు ఇవ్వని చోట ఇవ్వకలేకపోయాం. ఇచ్చిన చోట బీసీ ఐక్యత ప్రదర్శించాలి. బీసీ బిడ్డ జైపాల్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు బొంతు రామ్మోహన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.


కల్వకుర్తి ప్రజాఆశీర్వాదసభలో పాటకు నాయకులతో కలిసి స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## మరోసారి అవకాశం ఇవ్వండి



■ కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, నవంబర్ 19 : కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలి. సీఎం కేసీఆర్ కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వంద, యాభై పడకల దవాఖానలు ఏర్పాటు చేశారు. ఎంజీకేఎల్ఐ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీటిని అందించి కల్వకుర్తి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా మరో లక్షా ఇరవైఐదువేల ఎకరాలకు సాగునీరందనున్నది. పీఆర్‌ఎల్ఐ-కేఎల్ఐతో నియోజకవర్గమంతా సస్యశ్యామలం కానున్నది. కల్వకుర్తిలో ఇంజినీరింగ్ కాలేజ్, ఐటీ హబ్, ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం, ఎంవీఐ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు సీఎం కేసీఆర్ సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని వెల్జాల, గట్టిప్పలపల్లి, రఘుపతిపేటను కొత్త మండలాలుగా ఏర్పాటు చేయాలన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే

బడంగ్‌పేట, నవంబర్ 19 : ఆడ బిడ్డను ఆశీర్వదించి.. అభివృద్ధికి పట్టం కట్టాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పహాడీషరీఫ్‌లో ఆదివారం రోడ్ షో నిర్వహించగా, అపూర్వ స్పందన లభించింది. అడుగు అడుగునా ప్రజలు మంత్రికి నీరాజనాలు పలికారు. మంగళ హారతులు పట్టి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కనిపించని నాయకులు ఓట్ల కోసం వస్తే ప్రజలు ఎవరూ ఆదరించరన్నారు. ముఖం తెలియని నాయకులు ఓట్ల కోసం ప్రజల దగ్గర గ్యారడి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. మూడు గంటల కరెంటు సరిపోతుందని చెబుతున్నారన్నారు. మాయగాల మాటలను ప్రజలు నమ్మకూడదన్నారు. బీజేపీకి ఓట్లు వేస్తే మత కల్లోలాలు సృష్టిస్తారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. ప్రజల పైన పన్నుల భారం మోపిందన్నారు.

ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

